# చదువుకున్న భార్య

[రామ్మూర్తిపంతులు. వెంకట్రామయ్య. సుబ్బమ్మ, ప్రకాశం, కాంతం.]

రా: ఆఁ!—అయితే పిల్లవయస్సు ఎంత న్నారు?

వెం: ఏదండీ, మొన్న భోగీపండుక్కి పద్ధెనిమిదేళ్లొచ్చాయి. మీ అబ్బాయి వయస్సు ఇరవైరెండేళ్లు గనుక ఈడు బాగా కుదురుతుంది.

రా: ఇదివరకు వెయ్యి రూపాయిలు కట్నం ఇంకా ఇతర లాంఛనాలు అన్నీ యిస్తామని చెపుతూ చాలామంది చెప్పొచ్చారు. కాని ఒక్కపిల్లా మావాడికి నచ్చలేదు.

వెం: అవును మరి!—పెళ్లా?—కూరగాయల బేరమా?...మంచీ చెడ్డా చూసి చెయ్యాలి!

రా: ముఖ్యంగా పిల్ల చక్కనిదీ, చదువుకున్నదీ అయివుండాలి!

వెం: అవును, ఈ కాలంలో ముఖ్యంగా చూడవలసిన వారెండే!

రా: అయితే, పిల్ల ఎంతవరకు చదువుకుంది?

వెం: స్కూలుఫైనల్ పాసయిందండీ!—టైపు, షార్టుహేండు కూడా బాగా వచ్చును.

రా: అయితే బాగుంది!—ఇంతవరకు స్కూల్‌ఫైనల్ పాసైన అమ్మాయినే కాని మరి రెండో పిల్లని పెళ్లాడనని మావాడు పట్టుపడుతున్నాడు లెండి!

వెం: అవునండీ!—ఈ కాలంలో ఆపాటి చదువేనా లేకపోతే పనికిరారు.—

(అయిదునిముషాలు నిశ్శబ్దం)

రా: అయితే పిల్లని చూపిస్తారా?

వెం: ఆఁ!— ఇదుగో యిప్పుడే చూపిస్తాం!...(బిగ్గరగా) అమ్మాయ్, కాంతం! —ఇలా ఓసారిక్కడికి రామ్మా!—

(కాంతం వచ్చి కొంచెం సిగ్గు నభినయిస్తూ తల వంచుకొని తలుపు చాటున నిల్చుంటుంది)

వెం: సిగ్గెందుకమ్మా?—అదిగో అలాగా చాపమీద కూచో!

(కాంతం కొంచెం దూరంలో చాప మీద కూచుంటుంది)

రా: నీపే రేవిటమ్మా?

కాం: కాంతం.

రా: అయితే ఏ సంవత్సరం స్కూల్‌ఫైనల్ పాసయావమ్మా?

కాం: మార్చి ఫార్టీసైనులోనండి?

రా. పరీక్షల్లో మార్కు లెలాగ వచ్చాయమ్మా?

వెం: మార్కులు చాలా బాగా వచ్చాయండీ!—ఏ సబ్జక్టుల్లోనూ ఏభై మార్కులకి తగ్గలేదు. మొత్తం అన్నీ కలిపి మూడువందల యాభై మార్కులొచ్చాయి.

రా: చాలా బాగుంది!—అయితే పాటా అదీ ఒచ్చునా?

వెం: ఒక్కపాటే ఏవిఁటండీ!...ఫిడేలు, వీణ, హార్మనీ వాయిస్తుంది!

రా: అయితే మావాడికి తగిన పిల్లేనండి!—అన్నట్టు సినిమాపాటలు పాడగలదా?

## శ్రీ పంతుల కృష్ణారావు

వెం: ఎక్కువగా సినీమాపాటలే పాడుతుందండి!

రా: భేష్!—అయితే ఇంక మరేముంది?—ఏవిఁరా ప్రకాశం!...నువ్వేమంటావ్?

ప్రకా: ఏవొచ్చునో ఎలా వచ్చునో ఓసారి చూడాలి నాన్నా!

వెం: ఓ!—దానికేం అభ్యంతరం వుంది? తప్పకుండా చూడవలసిందే?...అయితే మొదట పాట పాడించమన్నారా?

ప్రకా: మొదట నడవమనండి!

వెం: ఏదమ్మా?—అల్లంతదాకా నడిచి వెళ్ళొస్తావా?

(కాంతం పదిహేనడుగులదూరం నడిచి వెళ్లివస్తుంది)

వెం: ఇందులో మీకేమీ అనుమానం లేదుకదాండీ?

రా: ఇందులో ఏమీ దోషం లేదు. కాని క్షమించండి! వివాహవిషయం గనుక మీ కెక్కువగా శ్రమ కలిగించి నిర్మొగమాటంగా ప్రవర్తించవలసి వస్తున్నాది.

వెం: అయ్యో, ఎంతమాట!—పెళ్లిచూపుల్లో ఈపాటి శ్రమ అందరికీ వుంటుంది. ఇలాటప్పుడు మొగమాటపడి వున్న అనుమానాలు తీర్చుకోవడం మానేస్తే తర్వాత అదే కొంపతీస్తుంది...దానికేం లెండిగానీ ఇంక మరేమేనా చూడాల్సివుందేమో చెప్పండి!

రా: చూడ్డానికి మరేం అనుమానాల్లేవు; కానీ మావాడే పిల్లకి ఎందులో ఎంత ప్రవీణత వుందో తెలుసుకుందామని ఉబలాట పడుతున్నాడు.

వెం: ఓహో!—అలాగా?—అయితే కానివ్వండి మరి?

ప్రకా: (చేతిలోవున్న 'హిందూ' పత్రికనిస్తూ) ఏదీ, ఈ పత్రికలోనిది ఏదో ఒపేరా చదవమనండి!

వెం: ఏదమ్మా?—ఎలా చదువుతావో వింటారట ఈ పత్రికలోది ఒపేరాచదువు!



(కాంతం పేపరుతీసికొని ఒకపేరా స్పష్టంగా వేగంగా చదువుతుంది)

ప్రకా: బాగానేవుంది!–దస్తూరి ఎలావుంటుందో ఓసారి ఇంగ్లీషులో రాయమనండి!

(కాంతం కలంతీసికొని కాగితంమీద రాసియిస్తుంది)

ప్రకా: దస్తూరికూడా చాలా బాగుందండీ!...పాటకూడా పాడించండి!

వెం: ఒక్క పాటే ఏమిటి? ఫిడేలు, వీణ, హార్మనీకూడా వాయిస్తుంది విందురుగాని!...ఏదమ్మా!–ఏదో ఒక మంచి సినీమా పాట పాడు!–హార్మనీ అవీ గదిలో వున్నాయి తమ్ముణ్ని తెమ్మను!

(కాంతం హార్మనీ వాయిస్తూ 'ఓహోహో, పావురమా!' అని పాడుతుంది)

ప్ర: పాట చాలాబాగుంది!

వెం: ఫిడేలు, వీణ వాయిద్యాలుగూడా విందురుగాని!–ఏమమ్మా?–ఆరెండుకూడా వాయించి వినిపించు.

(కాంతం ఫిడేలు కొంతసేపు, వీణ కొంతసేపు వాయించుతుంది)

ప్రకా: భేష్!–చాలా బాగుంది!

వెం: అయితే మా అమ్మాయిని పెళ్లాడ్డానికి అంగీకరించినట్టేనా?



ప్రకా: నాకు అంగీకారమే!

రా: నీ అంగీకారం అయితే నాకేం అభ్యంతరం?–అయితే ముహూర్తం స్థిరపరిచేవొచ్చా?

ప్రకా: స్థిరపరిచేవొచ్చు!

వెం: అయితే మరెందుకు కాలస్యం బావగారూ!–వేగంగా దగ్గర ముహూర్తం పెట్టించండి!

రా: అన్నీ అవుతాయి కానీ మీ అమ్మాయి యేమంటుందో అడగండి!

వెం: అమ్మాయి యేమంటుంది?–దానికిష్టమే?–ఏమంటావమ్మా? నీ కిష్టమేనా?

(కాంతం అంగీకార సూచకంగా చిరునవ్వునవ్వి సిగ్గుతో తల వంచుకుంటుంది)

వెం: అదిగో, దానికంగీకారమే బావగారూ! అంచాత దగ్గరముహూర్తం పెట్టించండి! పెళ్లిలోనే కార్యంకూడా జరిగిపోయేలా రెండింటికీ ముహూర్తాలు ఏర్పాటు చేయించండి!

రా: పెళ్ళయిన వెంటనే కార్యంకూడా జరిగిపోవాలనే నా వుద్దేశమూను!

వెం: అంచాతే రెండూ వేగంగా జరిగిపోవడం మంచిది.

రా: సరే, ఇంక మేం వెళతాం!

వెం: భోజనం చేయకుండా ఏమిటండీ?–భోజనంచేసి మధ్యాహ్నం ప్యాసింజరులో బయల్దేరి వెళ్ళుదురుగాని ఈపూటకిక్కడ వుండిపొండి!

* * * *

సు: అయితే యేమయిందండీ?–పిల్ల యెల్లావుంది? తెల్లగావుందా? నల్లగావుందా? ఏమేనా చదువుకుందా?

రా: అబ్బబ్బబ్బ!–ఊపిరి తీసుకోనిస్తావా లేదా? అమాంతంగా అన్ని ప్రశ్నలు వర్షంలా కురిపించేస్తే జబాబు చెప్పాలా?

సు: (చిరుకోపంతో) పోనీ, అడగన్లెండి–అవును, అడగడానికి నేనెవర్ని?–నాకొడుకు పెళ్లిసంగతి అడగడానికి నాకెక్కడ అధికారంవుంది?

రా: సరి!–విసుపుకొద్దీ నోరు జారి ఏదో మాటంటే ఇంక ఆరంభించింది గోల!

సు: పిల్లెలావుందని అడిగితే విసుగెందుకొచ్చిందీ?

రా: (కోపంతో) ఏదో గ్రహచారం కొద్దీ వచ్చింది?–ఇంక శాంతించు.

(సుబ్బమ్మ శాంతిస్తుంది. నిశ్శబ్దంగా అయిదు నిముషాలు గడుస్తాయి)

సు: అయితే పిల్ల బాగుందా?

రా: పిల్ల బంగారుబొమ్మలా వుంది. ఆరోఫారం ప్యాసైంది. బాగా పాడుతుంది. ఫిడేలు, వీణ, హార్మనీ వాయిస్తుంది.

సు: మన ప్రకాశం ఏమన్నాడు?

రా: ఇంకా అనడమేమిటి?–ఎన్నెన్ని పరీక్షలున్నాయో అన్ని పరీక్షలు చేసి

వ్వకుండా పెళ్లాడుతానని వాళ్ళతో చెప్పేశాడు. కట్నకానుకలు మనం కోరినవి వాళ్లిచ్చేస్తామన్నారు.

సు: అయితే ఇంకా మరేం ఆలోచన వుంది?

రా: ఆలోచనకి మరేమీ లేదు. దగ్గర ముహూర్తం చూసి వేగంగా జరిపించడమే తరువాయి!

సు: అన్నట్టు!—పెళ్లయిన వెంటనే కార్యంకూడా జరిగి పోవాలని చెప్పేరు కదూ?

రా: మనం అనవలసిన మాట వాళ్ళే అన్నారు పెళ్ళికీ, కార్యానికీ ముహూర్తం పెట్టించమని!

సు: అయితే బాగుంది!—మూడు ముళ్లూ పడి కార్యంకూడా అయిపోతే దాన్నిప్పుడే తనున్న వూరికి తీసుకుపోతాడు. అది వండి పడేస్తూవుంటుంది కనుక మరి మన ప్రకాశంకి హోటేలు భోజనం బాధ వుండదు. లేకపోతే ఆ భోజనం చేయలేక యెంతో యిబ్బంది పడును

రా: మరి వాడికి వండి పెడుతూ వుంటుందనేకదూ తొందర పడుతున్నాం?

సు: పోనీ, తొందర పడ్డందుకు మంచి సంబంధమే దొరికింది.

రా: మంచిదంటే యిలాంటిది అలాంటిదీనా?—ఇంతవరకూ అలాటి అందమైన పిల్లనీ, తెలివిగల పిల్లనీ, చురుకుగల పిల్లనీ నేనెక్కడా చూడలేదంటే నమ్ము!—ఇప్పటి మొగసుంటలకంటే ఇదే నయం!—టైపు, షార్టుహేండుకూడా బాగా వచ్చునట!

సు: శభాష్!—అన్నిటిలో నీ ప్రవీణురాలులా వుంది.

రా: మరేమిటనుకున్నావ్?—అన్ని విధాలా మనవాడికి తగిన భార్య.

సు: అయ్యో!—ఇన్నీ అడిగి పేరేమిటో అడగలేదు.

రా: ఎవరి పేరు?—పిల్లపేరా?... కాంతం?

సు: పేరుకూడా యెంతో బాగుంది.—వేగంగా ముహూర్తాలు పెట్టించియండి!

రా: ఇదిగో, యిప్పుడే అవధానులుగారి దగ్గరికి వెళ్లి పెళ్లికి, సారెకీ ముహూర్తం పెట్టించేను?

*　　*　　*　　*

ప్రకా: ఇదిగో, కాంతం!—ఈరోజే మన సంసారిక జీవితానికి ప్రారంభదినం!—ఇదిగో బజారునుంచీ సామాన్లు తెచ్చాను. ఎలా చేస్తావో?— చెప్పడానికేనా మనవాళ్లెవరూ లేరు. అంచాత జాగ్రత్తగా చూసుకోవాలి. కావలసినవన్నీ తెచ్చాను. మొదట వంట ప్రారంభించు!—మళ్ళీ పది గంటలకి ఆఫీసుకి పోవాలి!

కాం: అయ్యో!—నాకు వంటచేయడం రాదే!

ప్రకా: అదిగో, ఇప్పుడే ఆరంభించావూ?—ఇంకా ముందల్లా వుందిలే నీ పేచీలకి కాలం!

కాం: అయ్యో!—నిజంగా నాకు వండడం రాదండీ!

ప్రకా: మరి పేచీ పెట్టుకు!—నీకు వంటరాక పోవడమేమిటి?—పోనీ ఎలా చేతనైతే అలాగే వండు! లేమరి!—త్వరగా కానీ!

కాం: చెప్తే నమ్మరుకదా!—నాకు వంటచేయడం రాదండీ బాబూ! ఆఖరికి కాఫీ డికాషన్ కూడా చేయలేను.

ప్రకా: (కోపంగా) కాంతం!-ఏమిటీ పెంకితనం?—వంట చేస్తావా లేదా?

కాం: (సీరియస్ గా) నాకు వంటరాదని యిందాకటినుంచీ చెబుతున్నాను. మీరు వినకపోతే నేనేం చేయగలను?

ప్రకా: (కోపంతో) ఆడదానివై యుండి వంటచేయడం రాదంటే నలుగురు నవ్వుతారనేనా సిగ్గు వుండనక్కరలేదూ?

కాం: ఈ ఆధునిక యుగంలో స్త్రీలకు వంట నేర్చుకు తీరాలన్న నిర్బంధం లేదు.

ప్రకా: (అధికమైన కోపంతో) ఎవళ్లో బ్రహ్మచారిణి ముండలకి లేకపోతే నీకు లేదూ?-అలా అయితే పెళ్లి చేసుకు వెలగబెట్టి మొగుడికెలా వండి పెడదామనుకున్నావ్?

కాం: నాచేత వండిపెట్టించుకు తినడానికి మీరు నన్ను పెళ్లాడుతున్నారని అనుకోలేదు.

ప్రకా: అయితే మరెందుకనుకున్నావ్?—అమ్మశక్తిలాగ నిన్నింట్లో కూచోపెట్టుకొని నేను వండడానికా?

కాం: ఏమో!—నాచేత ఎక్కడైనా ఉద్యోగం చేయించుతారేమో ననుకున్నాను.

ప్రకా: (కోపంతో) కాంతం!—ఏమిటీ వేషం?- వంటచేయడం యెందుకురాదో చూస్తాను! మొదట కుంపటి రాజెయ్యి!

కాం: నాకు రాదని చెబుతున్నాను. ఇంక నన్నా పనికోసం నిర్బంధించకండి!—కావలస్తే వర్కేలాగో చెప్తే మీ ఆఫీసు వర్కంతా ఒక్కరోజులో చేసేస్తాను.

ప్రకా: ఇంక ఆపనే మిగిలిపోయింది!- అయితే వంటరాదని పెళ్ళిచూపుల కొచ్చినపు డెందుకనలేదు?

కాం: మీరు నాచేత వండిపెట్టించుకుందికి పెళ్ళాడుతూన్నట్టు తెలిస్తే ఆనాడే ఈ విషయం మీకు తెలిపియుండే దాన్ని!-అదీగాక మీరు వంటొచ్చునా? రాదా? అని అడగలేదు

ప్రకా. వండిపెట్టించుకుందికి పెళ్లాడుతున్నానని నువ్వెందుకనుకోలేదు?

కాం. పెళ్లాడిన తర్వాత నాచేత వంట చేయించుకుంటారని అనుకోలేదు. పెళ్లాడి నాచేత ఉద్యోగం చేయిస్తారని ఊహించాను. ఎందుచేతనంటే మీరు మొదట నన్ను చూడ్డానికొచ్చినప్పుడు స్కూలు ఫైనల్ పబ్లిక్ పరీక్షల్లో మార్కులెలా వచ్చాయని అడిగారు. తర్వాత ఇంగ్లీషు పేపరు చదివించారు. ఆతర్వాత 'రిటెక్ టెస్టు' చేశారు.—ఇంక మీరు స్కూలుఫైనల్ పాసైన అమ్మాయే భార్య కావాలన్నారు. నవనాగరికురాలు, అందమైన అమ్మాయి అయివుండాలన్నారు. సినీమా పాటలు బాగా పాడగలిగి వుండాలన్నారు. ఇన్ని 'క్వాలిఫికేషన్లు' గల అమ్మాయిని పెళ్లాడి ఆమెను వంటింట్లో పొయ్యి పొగలో కూర్చోబెడతారని నేను అనుకోలేదు.

ప్రకా: (రెండునిముషా లాలోచించి) అయితే మరి మన భోజనాలెలాగ?

కాం: మరి ఎలాగేమిటి?-హోటల్ నుంచీ తెప్పించుకోడమో, లేకపోతే వంట మనిషిని పెట్టుకోవడమో చేయాలి!

ప్రకా: వంటమనుషులీ వూళ్లో దొరకరు.

కాం: అయితే హోటల్ నుంచీ తెప్పించుకోడమే మార్గం!

ప్రకా: రోజూ రెండుపూటలా హోటల్ నుంచి తెప్పించుకుంటే నెలయేసరికి మనిద్దరికి తొంభై రూపాయిలవుతాయి. నాకొచ్చిన నూరుజీతపు రాళ్లలోనీ తొంభై ఒక్క భోజనానికేపోతే మిగిలిన ఖర్చులన్నీ ఎలా వెళతాయి.

కాం: మీకా భయం యేమీ అవసరం లేదు. నేనెక్కడేనా ఉద్యోగం చేస్తాను. అప్పుడు మనిద్దరికీ వచ్చిన జీతం అన్నిటికీ సరిపోతుంది. ★

గెల్వండి! గెల్వండి!!

రు 1,000.

ఆల్ కరెక్టు రు 500. 1 తప్పునకు రు 250. 2 తప్పులకు రు 150. 3 తప్పులకు రు 100.

మా N. V. B. తెలుగు క్రాసువర్డు పజిలుకు పోటీచేసి గెలుపొందుటకు యిదియే మంచి అవకాశము.

కూపనులకు : వివరములకు,

నవభారత లక్కీ ప్రైజు,

ఆమదాలవలస. P. O. శ్రీకాకుళం జిల్లా.